
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.8, కనిష్ఠం 17.7



ఉపాధి కల్పన కార్యాలయంలో రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం సోమవారం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేళాను మెడ్‌ప్లెస్ కంపెనీ నిర్వహిస్తుందని ఫార్మసిస్టు, జూనియర్ అసిస్టెంట్, ఆడిట్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఫార్మసి విత్ టీసీఐ విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్ల వయస్సు అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొన వచ్చన్నారు. అర్హులైన వారు సంబంధిత ధ్రువ పత్రాలను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ధాన్యం కేటాయింపుల వ్యవహారం

రోజుకో మలుపు!



- జిల్లాలో ధాన్యం కేటాయింపుల్లో అవకతవకలు
- పలు మిల్లుల్లో పక్కదారి పట్టిన ధాన్యం
- రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలుకు అధికారుల యత్నం
- ధాన్యం కేటాయింపుల్లో ప్రజాప్రతినిధులు, అసోసియేషన్ జోక్యంపై అధికారుల ఆరా

నిజామాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కేటాయింపుల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. గత సీజన్‌లలో కేటాయించిన ధాన్యం కొన్ని మిల్లుల్లో పక్కదారి పట్టడంతో అధికారుల తనిఖీలతో బయటపడుతోంది. జిల్లాలో ఎఫ్‌సీఐకి కస్టమ్ మిల్లింగ్ కింద బియ్యం పెట్టని మిల్లులపై తనిఖీ చేయగా భారీ ఎత్తున ఈ వ్యవహారం బయటికి వస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 11మిల్లులు తనిఖీ చేయగా సుమారు రూ.150కోట్ల ధాన్యం పక్కదారి పట్టడంతో కొన్ని మిల్లులకు అధికారులు నోటీసులు జారీచేశారు. మరికొన్ని మిల్లులపై కేసులను నమోదు చేశారు. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం వసూలుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ధాన్యం కేటాయింపుల్లో అధికారుల తీరుపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. కేటాయించిన సంవత్సరంలోనే బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పెట్టే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోకపోవడం వల్ల కొన్నేళ్లుగా కొనసాగుతున్నట్లు ఉన్నతాధికారులు అంచనాకు వస్తున్నారు. ఈ వ్యవహారాల్లో నేతల ప్రమేయం కూడా ఉండడంతో వారి పాత్రపై కూడా ఆరాతీస్తున్నారు. బినామీలపేరిట మిల్లులు ఉండడంతో కేటాయింపుల సమయంలో ఎవరి జోక్యం ఉందో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపు

జిల్లాలో కొన్నేళ్లుగా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా తీసుకుంటుంది. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా జిల్లాలోని రైస్‌మిల్లులకు కేటాయింపు చేస్తుంది. ప్రతి సంవత్సరం రెండు సీజన్లలో ఈ ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. వానాకాలం, యాసంగి సీజన్‌లో కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని జిల్లాలో ఉన్న 270 రా, బాయిల్డ్ రైస్‌మిల్లులకు కేటాయింపు చేస్తున్నారు. నిబంధనల మేరకు కస్టమ్ మిల్లింగ్ చేసి సంస్థ ద్వారా ప్రతి సీజన్‌లో ఎఫ్‌సీఐకి ఇస్తున్నారు. ఏ సీజన్‌కు సంబంధించిన ధాన్యం ఆసీజన్‌లో కేటాయింపు చేసి ఆరునెలల్లోపే పట్టి బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పెట్టే విధంగా నిబంధనలను విధిస్తున్నారు. ఆ గడువు దాటినవారిపై ఫైన్ విధించి చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో గత కొన్నేళ్లుగా వరి సాగే విస్తీర్ణం భారీగా పెరగడం వల్ల ప్రతి సీజన్‌లో 5 నుంచి 7లక్షల మెట్రిక్ టన్నుల మధ్య ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ ధాన్యాన్ని మిల్లులకు గ్యారంటీ లేకుండానే కేటాయింపులు చేస్తున్నారు. గతంలో 20శాతం పైగా గ్యారంటీ తీసుకుని మిల్లులకు ధాన్యాన్ని కేటాయించేవారు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిబంధనలు మార్చడంతో ఎలాంటి గ్యారంటీ లేకుండా అసోసియేషన్ ద్వారా పత్రం తీసుకుని ఈ కేటాయింపులను చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, మిల్లర్ల జోక్యం ఎక్కువగా ఉండడం వల్ల బియ్యం రికవరీ కొన్న మిల్లుల్లో అనుకున్న విధంగా కాలేదు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రివ్యూ..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రివ్యూ నిర్వహించి ఆదేశాలు ఇచ్చిన తర్వాత అధి కారులు తనిఖీలు మొదలుపెట్టారు. వర్ని, కోటగిరి, రుద్రూర్, బోధన్, నిజామాబాద్ రూరల్ మండలాల పరిధిలోని మిల్లులను తనిఖీ చేశారు. ఈ మండలాల పరిధిలోని 11 మిల్లుల్లో సుమారు రూ.150కోట్ల విలువైన ధాన్యం లేనట్లు గుర్తించారు. ఈ ధాన్యానికి సం బంధించిన వివరాలు అందించాలని ఆయా మిల్లులకు నోటీసులు జారీచేశారు. బియ్యాన్ని గడువులోపు ఎఫ్‌సీఐకి అందించాలని కోరారు. గడువులోపు ధాన్యం చూపెట్టని, ఎఫ్‌సీఐకి బియ్యం పెట్టని 11మిల్లులపై చర్యలు చేపట్టారు. కొన్ని మిల్లులపై పోలీసులకు ఫిర్యాదు చేశా రు. మరికొన్ని మిల్లులకు నోటీసులు జారీచేశారు. ఈ సీజన్‌లో అధికారులు, మిల్లర్లు కొంతమేర కుమ్మక్కు కావడం వల్లనే ఈ కేటాయింపులు జరిగినట్లు తెలుస్తోంది. ఒక సీజన్‌కు సం బంధించిన ధాన్యాన్ని తీసుకుని మరొకసీజన్ ధాన్యం వచ్చిన తర్వాత బియ్యాన్ని అందించడం వల్ల వారికి కలిసివస్తుండడంతో బయటి మార్కెట్‌లో ఎక్కువగా అమ్మకాలు చేసినట్లు అధికారుల తనిఖీల్లో గుర్తించారు. ఒక్కొక్క మిల్లుల్లో కోట్ల రూపాయల ధాన్యం బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలు చేసి లాభాలు గడించినట్లు అంచనా వేశారు. ఆ రెండు సం వత్సరాల్లో పనిచేసిన అధికారులు గట్టిగా ఒత్తిడి చేయకపోవడం, కొంత మంది ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్ల ఎక్కువ మొ త్తంలో ఈ ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని రికవరీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. రెవెన్యూ రికవరీ యాక్టు కింద చర్యలు తీసుకుంటున్నారు.

మార్కెట్‌కు బియ్యం తరలింపు

జిల్లాలో ధాన్యం కేటాయింపులు మొదట చేసిన విధంగానే కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందించిన మిల్లర్లు ఆ తర్వాత కొద్దిమంది బయటి మార్కెట్‌కు తరలించడం చేశారు. బయట డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ధాన్యంతో పాటు బియ్యాన్ని కొన్ని మిల్లులవారు అమ్ముకున్నారు. నిర్ణీత సమయంలో ఈ మిల్లుల నుంచి ఎఫ్‌సీఐకి కస్టం మిల్లింగ్ కింద బియ్యం పెట్టాల్సి ఉన్నా వాయిదా వేస్తూ వచ్చారు. కొన్ని సమయాల్లో ప్రజాప్రతినిధులు, మిల్లర్ అసోసియేషన్‌ల ద్వారా ఒత్తిళ్లు తెచ్చి వాయిదా వేశా రు. మరోసీజన్ ధాన్యం రాగానే వాటిని పట్టి బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పెట్టేవారు ఒక సీజన్‌ను వాయిదా వేస్తూ కొన్ని మిల్లుల యజమానులు నెట్టుకువచ్చారు. జిల్లాలో 2021-22, 2022-23 సీజన్‌కు సంబంధించి కొన్ని మిల్లుల యజమానులు ఎన్నిసార్లు అధికారులు డిమాండ్ చేసినా బియ్యాన్ని పెట్టలేదు.

కేటాయింపుల్లో ప్రజాప్రతినిధుల ప్రమేయం!

ధాన్యం కొనుగోళ్ల నుంచి మిల్లర్లకు కేటాయింపు, ఎఫ్‌సీఐకి బియ్యాన్ని అందించే వరకు భారీ ఎత్తున కుంభకోణం జరిగినట్లు ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. ఆ కేటాయింపుల్లో అన్నీ అసోసియేషన్ ప్రతినిధులు, నేతల ప్రమేయంతోనే జరిగినట్లు భావిస్తున్నారు. కొనుగోలు నుంచి ఎఫ్‌సీఐకి లేవీ పెట్టడం వరకు అన్నిచోట్ల సిఫారసులను విని యోగించినట్లు తెలుస్తోంది. అధికారులు చేస్తున్న తనిఖీలు, దర్యాప్తులో ఈ విషయాలు బయటపడుతున్నాయి. ధాన్యం కొనుగోలుతో పాటు సహకార సంఘాలకు కమీషన్ చెల్లింపులు, కొనుగోలు సమయంలో తీసిన కడ్త ధాన్యం గోల్‌మాల్ వ్యవహారాలు కూడా దర్యాప్తులో వెలుగుచూస్తున్నాయి. మిల్లర్ల చేతివాటం బహిరంగ మార్కెట్‌లో అమ్మకాల వంటి అంశాలలో కొంతమంది అధికారులు సహకరించడం వల్లే ఇది సాధ్యమైందని దర్యాప్తులో తేలడంతో వారి పాత్రపైన కూడా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. జిల్లాలో కొంతమంది ప్రజాప్రతినిధులు రైస్‌మిల్లులను నెలకొల్పిన ఎక్కువగా బినామీల పేరుమీద ఉంచడం వల్ల దర్యాప్తులో కానీ, కేసుల్లో కానీ వారి పేర్లు పెట్టే పరిస్థితి ఉండడం లేదు. ధాన్యం దారిమళ్లింపు వ్యవహారం, బియ్యం అమ్మకాలు జరిగిన వ్యవహారంలో మిల్లులు ఎవరిపేరుమీద ఉన్నాయో వారి పేరుమీదనే ఈ కేసులను నమోదు చేస్తున్నారు. కొన్ని మిల్లులు ధాన్యాన్ని నిరాకరించినా వారి పేరుమీద కేటాయించి ఇతర మిల్లులకు మళ్లించడం వల్ల కూడా ఎఫ్‌సీఐకి లేవీ కింద బియ్యాన్ని అందించలేదు. ఈ వ్యవహారం అన్నింటిని పరిశీలిస్తున్న అధికారులు మరిన్ని కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పాత్ర ఉన్న అధికారులందరిపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మిల్లర్లతో పాటు ఎంతమంది అధికారులపై చర్యలు ఉంటాయో దర్యాప్తులో తేలే అవకాశం ఉంది. ఎఫ్‌సీఐకి బియ్యం అందించడానికి ఈ నెలాఖరు వరకు సమయం ఇవ్వడం వల్ల అధికారులు మాత్రం మిగతా మిల్లుల నుంచి నిర్దిష్ట సమయంలో బియ్యాన్ని పెట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. బియ్యం అందించని మరికొన్ని మిల్లులపై కూడా కేసులు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కోర్టుల ఏర్పాటుతో త్వరితగతిన న్యాయం

- నూతన కోర్టుల ప్రారంభోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి తుకారాం

నిజామాబాద్ లీగల్, ఫిబ్రవరి 17: జిల్లాలో పెరుగుతున్న సివిల్, క్రిమినల్ కేసులను దృష్టిలో పెట్టుకొని రెండు నూతన కోర్టులను ఏర్పాటు చేశామని, దీని ద్వారా కక్షిదారులకు త్వరితగతిన న్యాయం జరుగుతుందని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి తుకారాం అన్నారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం ఆయన జిల్లా కోర్టులో అడిషనల్ సీనియర్ సివిల్ కోర్టు కం అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు, 5వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, 5వ అడిషనల్ ఫస్టక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులను ప్రారంభించారు. అనంతరం ఆయన న్యాయవాదులకు న్యాయ విజ్ఞానం పెంచుకోవడంపై పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనం నడిపే కోర్టు ఉద్యోగులకు ఉచితంగా హెల్మెట్‌లను అందజేశారు. కక్షిదారులకు అత్యవసర మౌలిక సదుపాయలు, ఫస్ట్‌ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల మాట్లాడుతూ.. జిల్లాకు రెండు నూతన కోర్టులను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాస్ చందక్, కార్యదర్శి బాగీచరణ్, ఉప అధ్యక్షుడు ఆశనారాయణ, బార్ సభ్యులు, హైకోర్టు కోర్టు, జిల్లా జడ్జిలను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి ఆశలత, శ్రీనివాస్, న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జిలు పి.పద్మావతి, ఎన్.శ్రీకాంత్‌బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు గోపీకృష్ణ, కుష్బూ చటోపాధ్యాయ, పి.శ్రీనివాస్, బార్ సభ్యులు రేంజర్ల సురేష్, బిట్ల రవి, సత్యనారాయణగౌడ్, న్యాయవాదులు కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి తుకారం

నూతన ఆవిష్కరణల ప్రదర్శన

- రైతులకు ఉపయోగపడే కొత్తపరికరాల ప్రదర్శన
- టీఎస్ఐసీ నాబార్డు సహాయంతో రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు

నిజామాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మనిషికి వచ్చే కొత్త ఆలోచనలు పరిష్కారాలకు వేదికగా మారుతున్న విద్యార్థి నుంచి సైంటిస్ట్ వరకు వ్యవసాయదారుని నుంచి ఇంజనీర్ వరకు తమకు వచ్చే ఆలోచనలను పరిశోధనలవైపు మళ్లించడంతో వాటి నుంచి వచ్చే ఉత్పత్తులు రైతులకు ఉపయోగపడే విధంగా మారుతున్నాయి. సాంకేతికత జోడించి తయారు చేస్తున్న పరికరాలు రైతులకు శ్రమశక్తిని తగ్గించడంతో పాటు ఉత్పాదకతను పెంచేందుకు ఉపయోగపడుతున్నాయి. విద్యార్థి నుంచి వ్యవసాయధారుడి వరకు తయారు చేసిన పరికరాలకు నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం శుక్రవారం వేదికగా మారింది. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో నిర్వహించిన ప్రదర్శనలో 20వరకు ఇన్నోవేషన్‌కు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. రైతులకు ఉపయోగపడే విధంగా విభిన్నమైన పరికరాలను ఈ ప్రదర్శనలో ప్రదర్శించారు. విత్తనం వేసే పరికరంతో పాటు నాట్లు వేసే యంత్రాలను ప్రదర్శనలో పెట్టారు. మహిళలు వంగి విత్తనాలు వేసేప్పుడు ఇబ్బంది పడుతుండడంతో వారికి ఇబ్బందులు లేకుండా ఉండే విధంగా ఈ పరికరాన్ని తయారు చేశారు. నిల్చుండే చేతి సహాయంతో విత్తనాలు వేసే విధంగా ఈ పరికరాన్ని రూపొందించారు. నాగలిసాలులో తేలికగా విత్తనం వేసే విధంగా దీనిని రూపొందించారు. విత్తనాలకు అవసరమైన సేంద్రీయ ఎరువులను కూడా ప్రదర్శనలో పెట్టారు. పంటలు కోసిన తర్వాత ఆరబెట్టేందుకు విద్యార్థులు తయారు చేసిన మిషన్‌ను ప్రదర్శనకు పెట్టారు. ఎండలో ఆరబోసేందుకు సమయం పడుతుండడంతో ఈ మిషన్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరబోసే విధంగా డిజైన్ చేశారు. ఇవే కాకుండా సోలార్ ద్వారా కంకులు కాల్చేందుకు తయారు చేసిన మిషన్‌కూడా ఆకట్టుకుంది. రైతులు డ్రిప్ సిస్టమ్ ద్వారా పంటలకు నీటిని అందిస్తున్నారు. రాత్రివేళల్లో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కొత్తగా తయారు చేసిన మెకానికల్ వాటర్ షిఫ్టింగ్ మిషన్‌ను ప్రదర్శనకు పెట్టారు. ఈ మిషన్‌లో టైమ్ ఫిక్స్ చేస్తే రైతు వెళ్లకుండానే అదే సమయంలో నిర్ణయించిన పంటవైపు నీటిని మళ్లించే విధంగా ఈ మిషన్‌ను తయారు చేశారు. ఇవే కాకుండా రైతులకు పలు రకాలుగా ఉపయోగపడే మిషన్లను ఈ ప్రదర్శనలో ఉంచారు. పంటలకు మందులను పిచికారి చేసే కొత్తరకం మిషన్లను కూడా ప్రదర్శనకు పెట్టారు. ఒకే భూమిలో ఎక్కువ రకాలు ఎలా పండించవచ్చో చిన్నికృష్ణుడు అనే రైతు ప్రదర్శన కూడా ఉంచారు. ఈ ప్రదర్శనకు విద్యార్థులతో పాటు రైతులు కూడా ఎక్కువమొత్తంలో హాజరయ్యారు. రైతుల్లో అవగాహన కల్పించేందుకు వారికి అవసరమైన పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకే ఈ ప్రదర్శనను టీఎస్ఐసీ తరపున ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ మేనేజర్ వాణి తెలిపారు. గ్రామీణ అభి వృద్ధిలో బాగంగా రైతులకు ఉపయోగపడే ప్రదర్శనలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పలు జిల్లాల్లో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన వల్ల రైతులకు అవగాహన కావడంతో పాటు కొత్త పరికరాలు కూడా అందుబాటులోకి తీసుకువచ్చేందుకే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



నూతన పరికరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



విజయవంతమైన వన్ డిస్ట్రిక్-వన్ ఎగ్జిబిషన్

తెలంగాణ స్టేట్ ఇన్‌ఫర్‌మేషన్ సెల్ ఆధ్వర్యంలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చరల్ రూరల్ డెవలప్‌మెంట్ నాబార్డు ఆధ్వర్యంలో నిర్వ హించిన వన్ డిస్ట్రిక్ వన్ ఎగ్జిబిషన్ విజ యవంతమైంది. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ ప్రదర్శన క్షేత్రస్థాయి ఉపయోగపడేలా వినూత్న ఆవిష్కరణ ప్రదర్శన చేయడం జరిగిందని అన్నారు. చాలా మంది రైతులు ప్రదర్శనను తిలకించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీఎం కార్తిక్, టీఎస్ఐసీపీఆర్ మేనేజర్ ముగ్ధవరపు వాణి, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వలసల జోరు

హస్తం గూటికి బీఆర్ఎస్ నేతల క్యూ



- జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ గూటికి క్యూ కడుతున్న బీఆర్ఎస్ శ్రేణులు
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ నేతలు
- బీఆర్ఎస్‌పైనే అధికార పార్టీ కాంగ్రెస్ నేతల ఫోకస్

నిజామాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీలోకి వలసలు భారీగా పెరుగుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్‌కు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఆ పార్టీలో చేరుతున్నారు. మరో ఐదేళ్ల కాంగ్రెస్ అధికారంలో ఉండనుండటంతో కలిసి వస్తుందని నేతలు భావిస్తున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆయా నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ నేతల ద్వారా పార్టీలో చేరుతున్నారు. బీఆర్ఎస్ నుంచి వలసలు మొదలైన ఆ పార్టీకి చెందిన జిల్లా నేతలు నియోజకవర్గ ఇన్‌చార్జిలు కూడా పట్టించుకోకపోవడంతో ఎక్కువ మంది కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మున్సిపల్, జడ్పీ, సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు ఎక్కువ మంది చేరుతున్నారు. జడ్పీవైస్ చైర్మన్‌తో పాటు నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లు ఇప్పటికే చేరగా మరికొంత మంది త్వరలోనే చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

పార్టీ బలోపేతంపై కాంగ్రెస్ దృష్టి

వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టింది. జిల్లాలో ఇతర పార్టీల నేతలను చేర్చుకునేందుకు ప్రయత్నాలను మొదలు పెట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కొంత మంది నేతలు చేరేందుకు సిద్ధం కాగా ఆయా నియోజకవర్గాల్లో ముఖ్యమైన నేతలను గుర్తించి ఇన్‌చార్జిలు చర్చలు జరుపుతున్నారు. వారిని పార్టీలో చేర్చుకుంటున్నారు. శాసనసభ ఎన్నికలకు ముందే బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి ఆమె భర్త మరికొంత మంది కార్పొరేటర్లతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఆర్మూర్ మున్సిపాలిటీ చైర్మన్ కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. అవిశ్వాసం పెట్టడంతో ఆమె బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం. రెండు రోజుల క్రితం జడ్పీ వైస్‌చైర్మన్ రజిత యాదవ్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నిజామాబాద్ కార్పొరేషన్‌కు చెందిన బీఆర్ఎస్ ఇద్దరు కార్పొరేటర్లు పార్టీని వీడి మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో పార్టీలో చేరారు. వీరితో పాటు మరో ముగ్గురు మాజీ కార్పొరేటర్లు కూడా పార్టీలో చేరారు. వీరంతా మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అనుచరులు. కాగా, బీఆర్ఎస్‌పైనే అధికార పార్టీ కాంగ్రెస్ నేతల ఫోకస్ పెట్టారు.



ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఎడపల్లి సొసైటీ చైర్మన్ పోల మల్కారెడ్డి

కాంగ్రెస్ వైపు.. మార గంగారెడ్డి చూపు!

- త్వరలో సీఎం సమక్షంలో చేరేందుకు ఏర్పాట్లు



రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మారగంగారెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నేతలు చర్చలు జరిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ఆయన చేరే అవకాశం ఉంది. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా కొనసాగుతున్న ఆయనతో ఇప్పటికే జిల్లాకు చెందిన మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చర్చలు జరిపారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌రెడ్డిలతో చర్చించిన ఆయన జిల్లాకు చెందిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ద్వారా పార్టీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌కు చెందిన గంగారెడ్డి బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌తో నేరుగా సంబంధాలు ఉన్న ఆయన ఉద్యమ కాలం నుంచి పార్టీలో ఉన్నారు. ఆర్మూర్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు పలు దఫాలు ప్రయత్నించారు. గత ఎన్నికల సమయంలో కూడా టికెట్ కోసం ప్రయత్నాలను చేశారు. ఆర్మూర్‌లో పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఓడిపోయినా నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా అధ్యక్ష పదవిని మార్చకపోవడం సీనియర్ నేతలతో పూర్తిస్థాయిలో చర్చించకపోవడం వంటి కారణాలతో ఆయన పార్టీ మారుతున్నట్లు సన్నిహిత వర్గాల బట్టి తెలుస్తోంది. ఆయనతో పాటు మరికొంత మంది చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17:జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 19న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళాను మెడ్‌ప్లెస్ కంపెనీ నిర్వహిస్తోందని ఫార్మసిస్టు, జూనియర్ అసిస్టెంట్, ఆడిట్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఫార్మసి విత్ టీసీఐ విద్యార్హత కలిగి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొన వచ్చని అన్నారు. 19వ తేదీ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల లోపు అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటో, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన కోరారు.

సిరిపూర్‌లో బైక్ దగ్ధం

మోపాల్, ఫిబ్రవరి 17:మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరిపూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన తస్మీయ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారని బాధితురాలు శనివారం మోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయస్థాయి సైన్స్ దినోత్సవ వేడుకలు

డొంకేశ్వర్, ఫిబ్రవరి17: డొంకేశ్వర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జాతీయస్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయి పోటీలను నిర్వహించారు. 8, 9తరగతి విద్యార్థులకు సైన్స్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో 15మంది పాల్గొనగా 8వ చదువుతున్న సహస్ర ప్రథమస్థానంలో, రక్షిత ద్వితీయ స్థాయంలో నిలిచింది. ఈనెల 20న జరిగే జిల్లాస్థాయి పోటీలలో విద్యార్థినులు పాల్గొంటారన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17: చిన్న వయస్సులో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన నారాయణ పాఠశాల విద్యార్థిని శ్రీనిధిని శనివారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, డీఈవో దుర్గా ప్రసాద్‌లు అభినందించారు. నగరంలోని సుభాష్‌నగర్‌లోగల నారాయణ పాఠశాలలో పీపీ-1 చదువుతున్న శ్రీనిధి చిన్న వయస్సులోనే 28 భారత రాష్ట్రాల రాజధానులు, 9 జాతీయ చిహ్నాలు, 5 జ్ఞానేంద్రియాలు, గాయత్రీ మంత్రం, గణితంలో రెండవ ఎక్కాలను చదవడం ద్వారా ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించిందని ఈ సందర్భంగా కలెక్టర్, డీఈవోలు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల తెలంగాణ జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం శివాజీ పాటిల్, ప్రిన్సిపల్ జ్యోష్న తదితరులు పాల్గొన్నారు.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్థక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్థక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై మైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్, శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై మైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా.. సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై మైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాప్నికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

డిచ్‌పల్లిలో కేసీఆర్,బాజిరెడ్డి జన్మదిన వేడుకలు



కేసీఆర్, బాజిరెడ్డి గోవర్ధన్ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, మాజీ సీఎం కేసీఆర్, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ల జన్మదిన వేడుకల సందర్భంగా శనివారం డిచ్‌పల్లి మూప్పై పడకల ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మోపాల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గో వర్ధన్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మొచ్చ శ్రీను ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మో పాల్ మండల కేంద్రంలో ఉన్న తల్లి తెలంగాణ విగ్రహానికి పూలమాలల వేశారు. అనంతరం కేసీఆర్, బాజిరెడ్డి గోవర్ధన్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లను పంచిపెట్టారు. వీరిద్దరు ఆయురారోగ్యాలతో నిండునూరేళ్లు జీవించాలని ఆ పార్టీ నాయకులు దేవుళ్లను కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షురాలు లత కన్యరాం, రైతు సమన్వయ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, కన్యరాం, నాయకులు నరేష్, శ్యామ ముత్యంరెడ్డి, తాజామాజీ ప్రజాప్రతినిధులు సాయిరెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ సుమన్, సిద్దార్థ, రింగుల భూ మయ్య, అజీం, జగదీష్, నరేందర్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రీపెయిడ్ మీటర్ల ఆలోచన మానుకోవాలి

సుభాష్‌నగర్,ఫిబ్రవరి17:కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్ల ఆలోచనను మానుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయ పీవో పోశెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి బీజేపీ దేశంలో ఉన్న విద్యుత్ వినియోగదారులకు ప్రీపేడ్ మీటర్ల నెట్‌వర్క్‌లోకి తేవాలని, స్మార్ట్ మీటర్లు బిగించాలని ప్రస్తుతం ఉన్న మీటర్లను తొలగించాలని చూస్తోందని అన్నారు. ప్రీపేడ్ మీటర్లు ప్రవేశపెడితే వినియోగదారులపై మరింత భారం పడనుందని అన్నారు. కరెంట్ ప్రీపేడ్ మీటర్ల ఆలోచనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి ఓమయ్య, జిల్లా నాయకులు రంజిత్, హన్మాండ్లు, సురేష్, రాధా, కుమార్, పాల్గొన్నారు.

ఇసుక, గంజాయి రవాణాపై చర్యలు చేపట్టాలి

బోదన్ రూరల్, ఫిబ్రవరి17: బోధన్, సాలూర మండల మంజీర సరిహద్దు గ్రామాల నుంచి అక్రమంగా రవాణా అవుతున్న ఇసుక, గంజాయిలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని బోధన్ రూరల్ సీఐ కోల నరేష్ అన్నారు. శనివారం సాయంత్రం రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను, పెండింగ్ కేసులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం ఖండ్‌గావ్ గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్‌లను పట్టుకోవడం జరిగిందన్నారు. ఎంతటి వారైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు కొరకు వచ్చే ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్సై నాగనాథ్, ఏఎస్సై రవీంధర్లతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



రూరల్ పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న రూరల్ సీఐ

కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచి పోతాయి

● కేసీఆర్ పుట్టినరోజు వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేస్తున్న దృశ్యం



ఏర్గట్లలో కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు



కోటగిరిలో..

బోధన్‌రూరల్, ఫిబ్రవరి17: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన హయాంలో పేద ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని బీఆర్ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ అన్నారు.శనివారం కేసీఆర్ జన్మదినం సందర్భంగా బోధన్ ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి కోసం అనునిత్యం కృషి చేసిన తెలంగాణబాపు అని కొనియాడారు. నిండు నూరేళ్లు ఆయుఆరోగ్యాలతో ఉండాలని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, కౌన్సిలర్లు కొంద్ర పద్మ, అశ్వక్, ధూప్‌సింగ్, నక్క లింగారెడ్డి, అబ్దుల్ రజాక్, రవిశంకర్‌గౌడ్, భవానిపేట్ శ్రీనివాస్, శంకర్‌గౌడ్, ప్రవీణ్‌జాదవ్, ఎన్నార్‌హైమద్. మసూద్, శ్రీనివాస్, మేడి రవి, సాయిలు, తదితరులు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో శనివారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కోటగిరి, పోతంగల్ మండల కేంద్రాల్లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మండల బీఆర్ఎస్ అధ్యక్షులు ఏజాజ్ ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు రాష్ట్ర అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ శాంతేశ్వర్ పటేల్, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, బీఆర్ఎస్ నాయకులు వీరేశం, సాయిలు, మాణిక్ అప్ప, కాశ గౌడ్, హంగర్గ గంగాధర్, మాజీ సర్పంచ్‌లు పత్తి లక్ష్మణ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. అనంతరం విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తెడ్డు పోశెట్టి, నవీపేట సొసైటీ చైర్మన్ అబ్బన్న, ఎంపీటీసీలు జనార్ధన్, కృష్ణ మోహన్ రావు, నాయకులు సూరిబాబు, శ్రీనివాస్ గౌడ్, లోకం నర్సయ్య, సతీష్, అప్సర్, తదితరులున్నారు.

రెంజల్: రెంజల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు భూంరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం మండల బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలపార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్ మండల నాయకులతో కలిసి కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండలఅధ్యక్షుడు బద్దం రాజేశ్వర్, ఎంపీటీసీ మైలారం సుధాకర్, హైమద్, రాజేశ్వర్, ఓంకర్ శ్రీనివాస్ నరేందర్, కోరె నర్సయ్య, హల్దె కిషన్, రఘు, మహేందర్, గంగారెడ్డి, కౌడ భూమేశ్వర్, మురళి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఏర్గట్ల: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు శనివారం పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి,జడ్పీటీసీ గుల్లెరాజేశ్వర్, భారస మండలాధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం, కోఆప్షన్ సభ్యుడు ఎండి అశ్రఫ్, పిఏసిఎస్ చైర్మన్ బర్మ చిన్ననర్సయ్య, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, బద్దం ప్రభాకర్, రాజారాం సహదేవ్, కొలిప్యాక శ్రీనివాస్, ఓర్సురాములు, రాజారాం సహదేవ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌రూరల్: భీమ్‌గల్ పట్టణంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. టపాసులు కాల్చి, మండల పరిషత్ ఆవరణలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటినర్సయ్య,ఒరగంటి గంగాధర్,మండల బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పది కాలాలపాటు ప్రజలకు ఉపయోగకరంగా కల్యాణ మండపాలు

● కాంగ్రెస్ హయాంలో ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తాం ● 20న పరిరక్షణ కమిటీ రాక ● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



కళ్యాణ మండపానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్ రూరల్/ఎడపల్లి, ఫిబ్రవరి17: పది కాలాలపాటు ప్రజలకు ఉపయోగపడేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ మండపాలను నిర్మిస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ శివారులోగల శ్రీ లక్ష్మి నర్సింహస్వామి ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం కళ్యాణ మండప నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.78 లక్షలనిధులతో అన్ని రకాల అధునాతన హంగులతో కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యత లోపాలు లేకుండా వాస్తు ప్లాన్ ప్రకారం వంటగది, భోజనశాల, కళ్యాణ వేదికను ఏర్పాటు చేయాలన్నారు. మూడు నాలుగు నెలలలోపు నాణ్యత లోపాలు లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పనులపై పర్యవేక్షించాలన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శ్రీ లక్ష్మి నర్సింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎడపల్లి సొసైటీ చైర్మన్

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పోల మల్కారెడ్డి, బాపు నగర్ మాజీ సర్పంచ్ సునీత రవిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, జైతాపూర్ సింగిల్‌విండో చైర్మన్ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, నాయకులు బిల్లా రాంమోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని మూసివేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే

బోధన్ రూరల్: నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని మూసివేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మాజీ సిఎం. కేసిఆర్, ఎమ్మెల్సీ కవిత, కేటీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరచడంలో విఫలమయ్యారని బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. శనివారం బోదన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం కమిటీ వేయడం జరిగిందన్నారు. ఈ నెల 15వ తేదీన సచివాలయంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీపై కమిటీ సభ్యులతో మాట్లాడడం జరిగిందన్నారు. ఈ నెల 20న పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, షైనంపల్లి రోహిత్‌లతో పాటు కమిటీ సభ్యులు నిజాం షుగర్ కర్మాగారాన్ని, పరిసరాలను పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్,మండలఅధ్యక్షుడు నాగేశ్వర్ రావు, పాషా మొయినొద్దీన్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధన్ రూరల్: దివ్యాంగులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, అంగవైకల్యం దేనికి అడ్డు రాదని అధైర్య పడొద్దని బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు.



కొండ చిలువలను చూపుతున్న అధికారులు

పది అడుగుల కొండ చిలువ పట్టివేత

ముప్కాల్, ఫిబ్రవరి 17: ముప్కాల్‌లో శనివారం జనావాసాల ప్రాంతంలో కొండ చిలువ చిక్కింది. స్థానికుల ద్వారా కొండ చిలువ బయట తిరుగుతుందన్న సమాచారం అందుకున్న పోలీసులు, అటవీ శాఖాధికారులు అక్కడికి వెళ్లి చూశారు. వలతో పట్టుకోగా.. పది అడుగుల కొండ చిలువ చిక్కుకుంది. అప్పటికే గాయాల పాలైన కొండ చిలువను కాపాడి.. అటవీ ప్రాంతంలోకి వదిలి వేశారు.

ఆర్మూర్ ఎంవీఐ బదిలీ

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి17: ఆర్మూర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి మెదక్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో ఆర్మూర్ ఎంవీఐగా మంచిర్యాల నుంచి వివేకానందునికి బదిలీపై రానున్నారు.

కొనసాగుతున్న వజ్రోత్సవాలు

ముప్కాల్, ఫిబ్రవరి17: మానవుని జీవితంలో ప్రతీ సమస్యకు భగవద్గీతో సమాధానం ఉంటుందని, ప్రతీఒక్కరు భగవద్గీతను చదివి భక్తిమార్గంలో నడవాలని నీరజనంద తీర్థస్వాముల వారు బోధించారు. శనివారం బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలో రెండవ రోజు కొనసాగుతున్నాయి. ఉదయం 9గంటల నుంచి 12వరకు, సాయంత్రం 4నుంచి 8గంటల వరకు వివిధ మఠాధిపతులు తమ ప్రవచనాలను భక్తులకు బోధిస్తున్నారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అవేషంగా పాల్గొని భక్తిపారవశ్యంలో మునిగితేలారు. దాతల సహకారంతో ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమలు నేటి ముగియనున్నాన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

బాధిత కుటుంబాలను పరామర్శ

ముప్కాల్, ఫిబ్రవరి17: బాల్కొండ మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. కిసాననగర్ గ్రామానికి చెందిన భూమన్న తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని, జలాల్‌పూర్‌లోని అమీర్ కూమారుడు చనిపోవడంతో వారి కుటుంబాన్ని, చిట్టాపూర్‌లో గంగాధర్ బావ రాజేశ్వర్ మరణించడంతో, బోదేపల్లిలో గడ్డం సాయన్న మరణించడంతో వారి కుటుంబసభ్యులను ముత్యాలసునీల్‌కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండల కాంగ్రెస్ నాయకులు జక్క రాజేశ్వర్, నాగేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వికలాంగుల వినతి

మోపాల్, ఫిబ్రవరి 17: మోపాల్ మండలంలోని వికలాంగులకు సమావేశం జరుపుకునేందుకు సొంత స్థలం భవనం నిర్మించి ఇవ్వాలని శనివారం మండల వికలాంగులు తహసీల్దార్ రామేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. మండలంలో సుమారు 600 మంది వరకు వికలాంగులు ఉన్నారని తాము సమావేశం జరుపుకునేందుకు ప్రైవేటు అద్దె భవనంలో జరుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వికలాంగులు సమావేశం జరుపుకునేందుకు ప్రభుత్వం స్థలాన్ని ఏర్పాటు చేసి భవన నిర్మాణం చేసి ఇవ్వాలని కోరారు. గత పాలకులకు కూడా వినతిపత్రాన్ని సమర్పించామని అయినా ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఈ ప్రభుత్వమైనా వికలాంగుల పట్ల దయ చూపి తమకు స్థలం భవనం నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వికలాంగులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

ముప్కాల్, ఫిబ్రవరి17: బాల్కొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్కూల్‌లో ప్రతిష్ఠించిన సరస్వతిదేవి విగ్రహ 23వ వార్షికోత్సవం వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టుచీర, బంగారు నగలతో అమ్మవారిని అందంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామలక్ష్మీ, ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, నర్సింహారెడ్డి, ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అబాకస్ వేదిక మ్యాథ్స్ పోటీల ముగింపు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17: అబాకస్, వేదిక మ్యాథ్స్ విద్యార్థుల్లో సృజనాత్మకత, జ్ఞాపకశక్తి పెరిగి గణితం అంటే భయం పోతుందని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో విశ్వం స్కూల్ ల్యాబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్, వేదిక మ్యాథ్స్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 120 పాఠశాలల నుంచి 530 మంది పరీక్షలు రాయగా అందులో 48 మంది విద్యార్థులకు విజేతలుగా ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. గెలుపొందిన విజేతలు ఈనెల 25న జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని రీజినల్ హెడ్ వినాయక్, జోనల్ మేనేజర్ మారుతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జయసింహాగౌడ్, అర్బన్ అధ్యక్షుడు ధర్మరాజు, మోహన్, శివ, రాజ్‌కుమార్, సాయి, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17: పదో తరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశమై పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కొనసాగుతాయని ఆయన వివరించారు. ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 35వేల 346 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 57 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పదో తరగతి పరీక్షలకు 22వేల 274 మంది విద్యార్థులు హాజరుకానుండగా 143 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షలు సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని ఆర్టీసీ ఆర్‌ఎం కె.జాన్‌రెడ్డికి సూచించారు. పరీక్షలు జరిగే సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేసి 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. తగిన సంఖ్యలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షలో డీఐఈవో రఘురాజ్, జిల్లావిద్య పరీక్షల విభాగం సహాయ కమిషనర్ విజయ్‌భాస్కర్, ఆర్టీసీ ఆర్‌ఎం జాన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు మీదే వేలకోట్ల దోపిడీ

» టీఎన్జీవోస్ డైరీ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ మహేష్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 17: పనికిరాని ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టుమీద లక్షా25కోట్లు ఖర్చుచేశారని, ఒక్క ప్రాజెక్టు మీదనే రూ.40వేల కోట్ల నుంచి 50వేల కోట్లు కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ఆరోపించారు. నగరంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో శని వారం ఏర్పాటు చేసిన నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్య క్రమంలో పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదిన్నర సంవత్సరాలలో ప్రజాస్వామ్యం మంటకలిసిందని, రాజరికపు పాలన కొనసాగిందన్నారు. బంగారు తెలంగాణ కేవలం కల్వకుంట్ల కుటుంబానికే బంగారంగా మారిందన్నారు. ఇంతఘోరంగా ప్రజల సొమ్మును లూటీచేసిన కుటుంబం దేశంలో ఉందంటే అది కేసీఆర్ కుటుంబమొక్కటే అన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ లూటీ చేశారన్నారు. తెలంగాణను సాధించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. మీ సమస్యలను ముఖ్యమంత్రికి తెలియజేస్తానన్నారు గత ప్రభుత్వ హయాంలో నెలకొల్పిన ధరణితో భూములు మాయమై పోయాయని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అప్పులకుప్పగా మారిందన్నారు. తెలంగాణ రాకముందు 65వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రం తొమ్మిదిన్నర సంవత్సరాల్లో 7లక్షల కోట్ల అప్పుల కుప్పగా మారిందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌లు కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 317జీవోతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారన్నారు. వాటిని పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. జిల్లాలు సైతం సైంటిఫిక్‌గా విభజన చేయలేదన్నారు. నిజాం దూరదృష్టితో వదిలేసిన భూములను కూడా కేసీఆర్ అమ్మకాలు జరిపాడన్నారు. కార్పొరేషన్‌ల మీద సైతం అప్పులు తెచ్చారన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీ, తదితర సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. అంతకుమందు టీఎన్జీవోస్ అధ్యక్షులు అలుక కిషన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం తమకు ఇస్తామన్న హామీలు నెరవేర్చలేదని, ఫంక్షన్ హాల్, తదితర విషయాల్లో కాలయాపన చేసిందన్నారు. ఇప్పుడైనా తమకు కావాల్సిన కోరికలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, టీజీవో అధ్యక్షులు అమృత్‌కుమార్, టీఎన్జీవోస్ కార్యదర్శి నేతికుంట శేఖర్, ఆకుల ప్రసాద్, సుమన్, పోల శ్రీనివాస్, ఉమాకిరణ్, జాఫర్, జాకీర్, శైలేష్ రెడ్డి, సత్యం, కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కవితనే పోటీ చేస్తుంది

» నేను నిజామాబాద్‌ను విడిచిపెట్టి పోయేదిలేదు

» బీఆర్ఎస్ ఆత్మీయసమ్మేళనంలో బిగాల గణేష్‌గుప్త



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 17: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కల్వకుంట్ల కవిత ఎంపీగా పోటీ చేస్తుందని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అన్నారు. నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అర్బన్ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయసమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓడినా, గెలిచినా తాను మాత్రం నిజామాబాద్‌ను విడిచిపోయేది లేదని, నిజామాబాద్ నుంచే పోటీ చేస్తానని అన్నారు. కొందరు ఇష్టమొచ్చినట్టు రాతలు రాస్తున్నారని, వాటిని నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. పార్టీని నమ్ము కున్న వాళ్లకే పార్టీ పదవులు, టికెట్లు ఉంటాయన్నారు. పార్టీని వీడేవారితో నష్టమేమీ లేదని, యువతతో పార్టీలోకి ఆహ్వానించి పార్టీని పటిష్ఠం చేస్తామని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పోరాడుతామన్నారు. పోయిన ఎన్నికల్లో ఓడిపోయిందే మంచిదైందని, బీఆర్ఎస్ ప్రభుత్వం లేకపోతే నిజామాబాద్‌కు ఏమీ చేయలేకపోయేవాడినన్నారు. అధికారంలో లేని ఎమ్మెల్యే ఉంటే చాలా ఇబ్బందులు వస్తాయన్నారు. అర్బన్ నియోజకవర్గం అంతా గందరగోళంగా ఉందని, ఎమ్మెల్యే బీజేపీ పార్టీ అని, మేయర్ బీఆర్ఎస్ పార్టీ అని, అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఓడిపోయిన కాంగ్రెస్ వాళ్లు ఇంచార్జిలుగా ఉండి అధికారం చలాయిస్తున్నారన్నారు. ఎప్పటికీ ముఖ్యమంత్రి మనకు కేసీఆరే అన్నారు. కుల మతాలను గౌరవించి అందరికి పథకాలు తెచ్చిపెట్టారన్నారు. 2009లో పోటీచేసి ఓడిపోయినా నిజామాబాద్‌ను విడిచిపెట్టి వెళ్లలేదన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నిజామాబాద్ అభివృద్ధికి కృషిచేశానన్నారు. కొత్తవాళ్లకు పార్టీలో అవకాశాలు ఉంటాయని, ఎవ్వరూ అధైర్యపడొద్దని కార్యకర్తలకు ధైర్యం నింపారు. పార్టీని వీడేవారతో పనిలేదని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్ఏ అలీం, దండుశేఖర్, ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, రాజేంద్రప్రసాద్, మీర్‌మజాజ్, నవీద్ ఇక్బాల్, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బిగాల గణేష్‌గుప్త మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం తెచ్చిన మహానీయుడని కొనియాడారు. మనకు ముఖ్యమంత్రి ఎప్పుడు కేసీఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్ఏ అలీం, దండుశేఖర్, ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, రాజేంద్రప్రసాద్, మీర్‌మజాజ్, నవీద్ ఇక్బాల్, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐ సాధిక్ అలీకి నివాళి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 17: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎక్సైజ్ సీఐ సాధిక్ అలీకి జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్ కాని స్టేబుళ్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం నివాళులు అర్పించారు. నగ రంలోని ఎక్సైజ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సాధిక్ అలీ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌ నం పాటించారు. జిల్లాలో పనిచేసిన రోజులన్నీ సాధిక్ అలీ నిబద్ధతతో పనిచేసి ఉద్యోగ ఔన్నత్యాన్ని కాపాడారని అన్నారు. గంజాయి, నాటుసారా వ్యాపారుల గుండెల్లో నిద్రపోయాడని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరిం టెండెంట్ మల్లారెడ్డి, సీఐలు దిలీప్, గుండప్ప, ఎస్ఐ మల్లేష్, ఎక్సైజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, చంద్రమోహన్, మంజుల, ఉత్తమ్, బండి నారాయణ, భోజన్న, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులు ఆర్టీసీకి సహకరించాలి

● రీజినల్ మేనేజర్ జానిరెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 17: నిజామాబాద్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు సహకరించాలని నిజామాబాద్ రీజియన్ అధికారి జానిరెడ్డి అన్నారు. తెలంగాణ కుంభమేళగా పేరుగాంచిన మేడారం సమ్మక్క, సారలక్క జాతరలకు ఈనెల 19 నుంచి 25 వరకు జరుగుతున్నందున రీజియన్ పరిధిలోని 270 బస్సులు వరంగల్ జిల్లాకు పంపించడం జరుగుతోందని తెలిపారు. నిజామాబాద్ రీజియన్ బస్సులు ఇతర జిల్లాకు తరలివెళ్లడంతో బస్సుల సంఖ్య తగ్గి ట్రిప్పుల సంఖ్య కూడా తగ్గి ప్రయాణికులకు కొంత అసౌకర్యం కలగవచ్చని అన్నారు. వారం రోజుల పాటు ప్రయాణికులు సహకరించాలని ఈసందర్భంగా ఆర్‌ఎం జానిరెడ్డి కోరారు.

'అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానం హర్షనీయం'

ఖిల్లా, ఫిబ్రవరి 17: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానాన్ని ప్రవేశపెట్టడాన్ని చరిత్రాత్మకమైన నిర్ణయమని బీసీ హక్కుల పరిరక్షణ సంక్షేమ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ కులాల లెక్కలకు చట్టభద్రత భరోసా కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి కృజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బీసీ కుల గణన చేపట్టడం, బీసీ సబ్‌ప్లాన్ పైన కూడా అసెంబ్లీలో చర్చించడం బీసీలకు పెద్ద ఎత్తున నిధులు సమీకరించడం వారి అభ్యున్నతికి పాటపడటానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల పరిరక్షణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాయవార్ రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు అశోక్, కార్యదర్శి రమేష్, సభ్యులు ఎన్.సత్యనారయణ, సుదర్శన్, పురుషోత్తండాస్, మహేందర్ గౌడ్, లక్ష్మణ్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ జన్మదినం సందర్భంగా జడ్పీ చైర్మన్ పూజలు

ఖిల్లా, ఫిబ్రవరి 17: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు నగరంలోని కంఠేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన ఆయురారోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నగరంలోని స్నేహ సొసైటీ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం మానసిక వికలాంగులతో కలిసి కేక్ కట్‌చేసి కేసీఆర్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అదేవిధంగా రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ జన్మదినం పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కేసీఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు రమణారావు, నాయకులు తెలంగాణ శంకర్, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ మాజీ పీపీ దాదన్నగారి మధుసూదన్‌రావు, నీలం రెడ్డి, శేఖర్‌రాజు, స్నేహసొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచాలి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి17: వచ్చే వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు నర్సరీలో మొక్కలను పెంచాలని ఎంపీడీవో ఎం.సతీష్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని గన్యతండాలో నర్సరీలో పెంచుతున్న మొ క్కలను ఆయన పరిశీలించారు. ఏపీవో రవి, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఖిల్లా, ఫిబ్రవరి 17:చేవెళ్లలో ప్రకటించిన ఎస్టీ డిక్లేరేషన్‌లో భాగంగా ఎరుకల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎరుకుల గిరిజనులను ఆదుకోవాలని కోరుతూ తెలంగాణా ఎరుకల హక్కుల ఐక్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోనేరుసాయికుమార్ కోరారు. శనివారం నగరంలోని ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఇంటిలో కలిసి వినతి పత్రం అందజేశారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,000	రూ.59,000	రూ.755

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మదమే వెబ్ (ఇంగ్లీష్) (12.20)
: తేరి బాతోన్‌మే అయిసాఉల్జాదీయా (3.00)
: ఓయ్ (6.10)
: ఊరుపేరు భైరవకోన (9.40)

స్క్రీన్-2 : ఈగల్ (12.00, 10.00)
: హనుమాన్ (3.20, 6.40)

స్క్రీన్-3 : రాజధాని ఫైల్స్ (1.00)
: మదమే వెబ్-ఇంగ్లీష్ (4.20, 10.05)
: శివరాయాంచ చావ (మరాఠి) (7.00)

స్క్రీన్-4 : ప్రవీణ్ ఐపీఎస్ (12.50)
: ఊరుపేరు భైరవకోన (4.20)
: మదమే వెబ్-ఇంగ్లీష్ (7.20)
: తేరి బాతోన్‌మే అయిసాఉల్జాదీయా (10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఊరుపేరు భైరవకోన (1.40, 7.35, 10.30)
: హనుమాన్ (4.30)

స్క్రీన్-2 : ఈగల్ (10.50, 10.30)
: మదమే వెబ్-ఇంగ్లీష్ (1.50)
: ఓయ్ (4.10, 7.20)

స్క్రీన్-3 : ఈగల్ (1.30, 4.30, 7.30)
: హనుమాన్ (10.30)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)

లలితమహాల్ : ఈగల్ (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : రాజధాని ఫైల్స్ (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : ఊరుపేరు భైరవకోన (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్